# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

## మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందియున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
(P.O. Box 80) Sambhamurthi St.
KAKINADA-533 004

## ప్రకటన

318 క్రైస్తవ కీర్తనలు గల పుస్తకము ఇంకొకటి ఇప్పుడు లభించుచున్నది. దాని ఖరీదు రూ. 10/- లు; పోష్టు ఖర్చులు రూ. 1-50 అదనం. వలయువారు ఈ దిగువ సహోదరుని సంప్రదించండి.

T. PRAKASA RAO
Church Christ - Bible Learning Centre,
KOMAROLE - 523 373.

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్యు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 జూలై 1992 సంచిక 12

## సంపాదకీయము

### దేవుని మట్టపు గుండు

### ( God's Plumbline )

మట్టపు గుండు కట్టబడిన గోడ సమాంతరముగాను క్రమముగాను ఉన్నదో లేదో చూచుటకు తాపీపనివారు ఉపయోగించు సాధనము. పరిశుద్ధమైన ఆమోసు తన గ్రంథములో దేవుడు తన వాక్యమను మట్టపు గుండు వేసి ప్రతి వారిని, వారి విశ్వాసమును పరీక్షించునని తెలియజేసెను. "మరియు యెహోవా తాను మట్టపు గుండు చేత పట్టుకొని గుండు పెట్టి చక్కగా కట్టబడిన యొక గోడమీద నిలువబడి ఇట్లు దర్శన రీతిగా నాకు కనుపరచెను. యెహోవా, ఆమోసూ నీకు కనబడుచున్న దేమని నన్నడుగగా నాకు మట్టపు గుండు కనబడుచున్నదని నేనంటిని. అప్పుడు యెహోవా సెలవిచ్చిన దేమనగా - నా జనులగు ఇశ్రాయేలీయుల మధ్యను మట్టపు గుండు వేయబోవుచున్నాను" (ఆమోసు 4:7-8).

దేవుడు మనపై మట్టపు గుండు వేయుచున్నాడు. దేవునియొద్ద నుండి వచ్చిన క్రీస్తు యిట్లు సెలవిచ్చెను: "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12 : 48).

ఒక వ్యాపారికి ఒక ఖచ్చితమైన కొలతలతో కొన్ని వందల పెట్టెలు అవసరమయ్యెను. ఒక వడ్రంగికి ఆ నిర్దిష్టమైన కొలతలతో తయారుచేయుటకు వర్తమానము పంపి 6 నెలల అనంతరము ఈ పెట్టెలను తీసుకొని వెళ్ళెదనని చెప్పెను. అతడు సకాలంలో తిరిగివచ్చి తన కొలత బద్ద తీసి ఒక్కొక్క పెట్టెను కొలిచి తన ఆర్డరు ప్రకారము అవన్నియు కొలతలు కలిగియుండుట చూచి మిక్కిలి సంతోషించెను. అతడు ఎట్లు యివన్నియు కొలత ప్రకారము ఖచ్చితముగ చేయగలిగితివని వడ్రంగిని ప్రశ్నించగా "అయ్యా, నీ దగ్గర ఉన్న కొలతబద్దవంటి కొలతబద్ద నావద్దకూడ ఉండుటయే దీనికి కారణము" అని జవాబిచ్చెను.

పరిశుద్ధ గ్రంథమిట్లు సెలవిచ్చుచున్నది: "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" హెబ్రీ 9:27. ఆయన తీర్పు తీర్చబోవుచున్నాడని తెలియజేయుటయే గాక ఆయన ఎట్లు తీర్పు తీర్చబోవుచున్నాడో కూడ తెలియజేయుట ఎంత ఘనమైన విషయము!

క్రీస్తు చెప్పెను: "ఆ దినమందు అనేకులు నన్ను చూచి, ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు - నేను మిమ్మును ఎన్నడును

ఎరుగను. అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును. కాబట్టి ఈ నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెనుగాని దాని పునాది బండమీద వేయబడెను. గనుక అది పడలేదు. మరియు ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటిమీద కొట్టెను, అప్పుడది కూలబడెను. దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్త 7:22-27).

మనము క్రీస్తు ఆజ్ఞాపించిన సంగతులకు విధేయులము కాకుండ ఎన్ని సత్కార్యములు జరిగించినను, ఎంత ప్రార్థించినను, ఆయన నామమును ఎంత ప్రకటించినను ప్రయోజనము లేదు. మనము ఆయన ఆజ్ఞాపించిన వాటిని నెరవేర్చక పోయినయెడల శిక్షావిధి పొందుటకై దోషులముగా ఆయన న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలసియుండును. దేవుని మట్టపు గుండును (అనగా వాక్యమును) నిర్లక్ష్యము చేయకుము, దాని నిమిత్తమై కృతజ్ఞత కలిగియుండి సృష్టికర్తయెదుట నీ జీవితమును సరిచేసికొనుటకు దాని నుపయోగించుకొనుము.

—o—

## నిజమైన మార్పు

## (Genuine Conversion)

నిజమైన మార్పును గూర్చి ఈనాడు సంఘాలలో అనేక భేదాభిప్రాయా లున్నాయి. నిజమైన మార్పు సంఘముతో చేర్చ

ఖడుటయా? అది ఒక మతసంబంధమైన అనుభవమా? దేవుడున్నా డనియు యేసు ఆయన కుమారుడని ఒప్పుకొనుటయా? జవాబు అవు ననే చెప్పాలి. కాని క్రొత్త నిబంధన సంబంధమైన నిజమైన మార్పులో ఇంకనూ అనేకమైన విషయాలు మిళితమై యున్నాయి. సత్యమును మనము పునరుద్ధరించవలసి యున్నది. నూతన నిబంధన యొక్క గురి యొద్దకు మనము తిరిగి రావలసియున్నది. నమ్మి బాప్తిస్మము పొందుట అంటే ఏమిటి? ఈ ఆజ్ఞలకు విధేయులగుటయే మార్పు చెందుట.

## పాపమునుండి నీతిలోనికి

## From Guilt to Righteousness

"ఎందుకనగా మన మాయన యందు దేవుని నీతి యగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" II కొరింథీ 5:21. మన పాపములు నీతిగా మార్చబడునట్లు ఆయన సిలువ బలి దానము రక్షణను సాధ్యపరచెను. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు (గలతి 3 : 27). "బాప్తిస్మములో క్రీస్తుతో యేకమైన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (Clothed with Christ) అని వ్రాయబడియున్నది. పాపమును ధరించుకొనిన నీవు మార్పు చెందితివా?

## పందుల గుడిసెలోనుండి భవనములోనికి

## A Move From Pig Pen To Mansion

నాశనకరమైన స్థితినుండి దూరదేశమునుండి తండ్రి గృహము లోనికి ప్రవేశము. తప్పిపోయిన కుమారుడు తండ్రి యింటనున్న ఆశీర్వాదమును తన పాపమువలన పోగొట్టుకొని నాశనకరమైన

నిస్సహాయ స్థితిలో ఉండెను. ఆత్మీయంగా పతనమై ఏ దిక్కు లేక "తండ్రీ నేను పరలోకమునకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని. నన్ను నీ కూలివారిలో ఒకనిగా పెట్టుకొనుము" అని చెప్పెను. తిరస్కారమునుండి అంగీకారమునకు పందుల గుడిసె నుండి తండ్రి గృహమునకు వచ్చుటయే మార్పు. స్నేహితులారా, మనము పాపులమని గ్రహించకపోతే మార్పు చెందలేము. మారుమనస్సు, పాపక్షమాపణ ఈ రెండు ఒకదానికొకటి సంబంధము కలిగి యున్నవి. మార్పుచెందిన ఆనందము నీవు పొందితివా?

## మరణమునుండి జీవములోనికి

## Changed From Death To Life

"ఆలాగైన ఏమందుము? కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇక మీదట ఏలాగు దానిలో జీవించుదుము? క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మన మందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి... అటువలె మీరును పాపము విషయమై మృతులుగాను దేవుని విషయమై క్రీస్తు యేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి" (రోమా 6 : 1-4 మరియు 11). క్రీస్తే నాయందు జీవించుచున్నాడని పౌలు చెప్పెను. పాపమునందు మరణించే ఈ జీవితాన్ని క్రీస్తునందు స్వాతంత్ర్యము పొందే జీవితంగా మార్చుకొనవలసి యున్నది: "కుమారుడు మిమ్మును స్వతంత్రులనుగా చేసినయెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు" యోహాను 8 : 36.

పాపము విషయమై మరణించి యేసునందు జీవించెదవా? అదే క్రొత్త నిబంధననాను సారమైన మార్పు.

## బలహీనతలోనుండి బలములోనికి

## Transformed From Weakness To Strength

పరిశుద్ధమైన యెషయా చెప్పిన మాట వినండి. "యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజులవలె రెక్కలు చాపి పైకి ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడిచిపోవుదురు" (యెష 40:31). ఈ వాగ్దానము కొరకు దేవునికి స్తోత్రము. ఈ వాగ్దానము నాకు కావాలి, నీకు కావలెనా ? చదవండి. విశ్వసించండి. అంగీకరించండి. ప్రకటించండి! ఈ వాగ్దానము మనందరిది. "నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను" అని పౌలు చెప్పెను (II కొరింథీ 12:10). ఆయన వాగ్దానమైన కృప మనకు చాలును. బలహీనతలలో ఆయన బలము నాకు కావాలి. మరినీకు ? "నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను.... కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:13, 16). నేను క్రీస్తునందు బలపడి, ఆయన నా ప్రతి అవసరమును తీర్చునట్లు, క్రొత్తనిబంధనాను సారమైన నిజమైన మార్పుయొక్క అనుభవము నాకు కావాలి. నీకు కావలెనా?

## మార్పుచెందుట అంటే మనము దేవుని పిల్లల మగుటయే

## Conversion Means that We Become Like Children

యేసు మాట వినండి. "చిన్న బిడ్డవలె దేవుని రాజ్యము అంగీకరింపనివాడు దానిలో ఎంత మాత్రమును ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను". పిల్లల ఆలోచనలు పవిత్రమై

నవి, ఆరోగ్యకరమైనవి మరియు దీనమనస్సు కలిగినవి. పిల్లలకు గర్వ ముండదు. గర్వము పాపము. పిల్లలు పాపములేనివారు, జగడమాడరు, వివాదాస్పదమైన విషయములు తర్కించరు. "వివాదములను లక్ష్య పెట్టవద్దని ఆజ్ఞాపించుటకు" తిమోతి పంపబడెను (1 తిమోతి 1 : 4 మరియు తీతు 3 : 9). వివాదములను ప్రకటించు ప్రజలు నిజముగ మార్పు చెందవలసి యున్నది.

యాకోబు వ్రాసిన గొప్ప పత్రిక ఈ మాటలతో ముగించ బడెను. "పాపిని వాని తప్పుమార్గమునుండి మళ్ళించువాడు మరణము నుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను" (యాకోబు 5:20). రక్షణ అంటే అనేక పాపములు కప్పివేయబడుటయే. అదే నిజమైన మార్పు. తండ్రీ మేము నిజముగా మార్పు చెందినవారముగ నుండునట్లు సహాయము చేయు మని యేసు నామమున ప్రార్థించుచున్నాము.

— రేండల్ కేసెల్‌మన్.

---

## సువార్త ప్రకటన - స్వస్థత ప్రకటన

## (Preaching of the Gospel *Vs.* Preaching of the Healing)

స్వస్థత కూటములు, స్వస్థత ప్రార్థనలు ఈ మధ్య ప్రముఖ ముగ వినిపించుచున్న విశేషాలు. సువార్త కూటములకు, స్వస్థత కూటములకు మధ్యనున్న వ్యత్యాసమేమంటే సువార్తకూటములు ఆత్మరక్షణ నినాదంతో మానవులను దేవుని సన్నిధికి తీసుకొని వెళ్ళే గురిని కలిగియున్నవి. స్వస్థత కూటముల ఉద్దేశ్యం కేవలం భౌతికం లేదా శరీర సంబంధమైన దృక్పథంతో జరుగుచున్నవి. ఈ స్వస్థత కూటాలకు హాజరయ్యే వారికి జగత్తు పునాది వేయబడక ముందే యేసుక్రీస్తు ద్వారా మానవులను పరిశుద్ధులనుగ నిర్దోషులనుగ చేయు

టకు చేయబడిన సంకల్పము అవసరము లేదు. కలువరి సిలువపై యేసుక్రీస్తు దేహము నుండి ప్రవహించిన రుధిర ధారల యొక్క ప్రయోజన మేమిటో తెలియదు. పాపక్షమాపణ, రక్షణ వీటితో సంబంధము లేదు. సంఘము యొక్క ప్రాముఖ్యము, సహవాస మందలి ఆనందము, దేవుని ఆజ్ఞలకు విధేయులగుటలో ఉన్న ధన్యతలు అక్కరలేదు. కంటికి కనపడని, చెవికి వినబడని మనుష్య హృదయమునకు గోచరము కాని, ఆశీర్వాదములను గూర్చి వినుటకు కూడ వీరు ఇష్టపడరు.

అయితే వీరికి కావలసిందేమిటి? స్వస్థత అంటే శరీరం ఆరోగ్యంగా ఉండాలి. వీరు స్వస్థత కొరకు ఏ దేవతనైనా సరే ఆశ్రయించడానికి వెనుకాడరని చెప్పుట ఆశ్చర్యం కాదు.

బైబిలు చెప్పే సత్యాలను వినండి. "మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు. పైనున్న వాటి మీదనే గాని, భూసంబంధమైన వాటి మీద మనస్సు పెట్టుకొనకుడి" (కొలస్సై 3:1-2). ఆత్మ సంబంధమైన ఉద్దేశ్యమును, గురిని విడిచిపెట్టి, క్రీస్తు నామమున భౌతిక సంబంధమైన ఆశలు చూపి ప్రజలను వంచించు వారిని పరిశుద్ధ గ్రంథమే ఖండించుచున్నది. ఆయన నామమున ప్రవచించి, దయ్యములను వెళ్ళగొట్టి, అద్భుతములు చేసితిమని ప్రభువు ఎదుట చెప్పువారిని "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను. అక్రమము చేయువారలారా నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్త 7:22-23) అని యేసు చెప్పెను. ఈ మాటలు వింటే స్వస్థత ప్రార్ధనలు, స్వస్థతకూటాలు దేవుని లేక లేఖనముల అధికారము చొప్పున జరిగించుచున్నవి కాదు అని గ్రాహ్యమగుచున్నది.

యేసుక్రీస్తు అద్భుతములు జరిగించిన ప్రయోజనము యోహాను 20:30-31 నందు వ్రాయబడి యున్నది. అపొస్తలులు జరిగించిన అద్భుతముల ప్రయోజనము మార్కు 16:20 నందు వ్రాయబడినది స్థిరపరచబడిన వాక్యము మనయొద్ద నుండగా, ఆ వాక్యము యేసు దేవుని కుమారుడని ఋజువు చేయుచుండగా అద్భుతముల పని ఏమి ?

"మీలో ఎవనికైనను క్షేమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయవలెను" యాకోబు 5:13. "మీలో" అను మాట సహోదరులలో లేదా సంఘములో ఎవనికైనను క్షేమ సంభవించెనా? అని అర్థము. స్వస్థతలు జరిగించుచున్నామని చెప్పుకొనువారు ఎవరికైనను సరేఏపని నిమిత్తమైనను సరే ప్రార్థన చేయుదురు. ఉద్యోగము, ప్రమోషన్లు సంతానము, సమస్యలు ఇంకా ఎన్నో అంశాలకొరకు సంఘములో లేని వారికొరకు ప్రార్థనచేస్తే అది దైవ చిత్తానుసారమైన ప్రార్థన ఎలా అవుతుంది? ఆయన చిత్తానుసారముగా మనము అడిగితే ఆయన మన మనవి ఆలకించునని 1 యోహాను 5 : 14 లో వ్రాయబడి యున్నది. ఈ వచన భాగమందు రెండు విషయాలున్నాయి. ఆయన చిత్తాను సారముగా అడగాలి. రెండవది "మన మనవి" అంటే సహోదరుల ప్రార్థన. "ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" మత్తయి 6 : 32, 33. సంఘము, వాక్యము లేదా రాజ్యము, నీతి వీటిని వెదకకయే అన్నియు అనుగ్రహింపబడాలని నీవు కోరితే యేసుక్రీస్తు మాటను ధిక్కరించి నట్లే గదా!

నేడు ప్రత్యేకమైన వరములు దేవుడెవరికీ అనుగ్రహించలేదు. స్వస్థతలు జరిగించుచున్నామని చెప్పుకొనువారు వాటిని జరిగించు చున్నారా? అని పరిశీలిస్తే "అద్భుత స్వస్థత" (Miraculous

Healing) జరిగించినట్లు ఒక్క ఋజువు కూడ చూపలేరు. దేవుని వాక్యము సత్యాలను మనముందుంచింది. వాక్యమునకు విరుద్ధముగ అద్భుతములు జరిగించు ప్రయత్నము చేయుచున్న వీరు అనేక సందర్భాలలో అవమానింపబడుటయే కాక దేవుని నామమును అవమానమునకు గురిచేయుచున్నారు. కొన్ని సంవత్సరముల క్రితము పుల్లేటికుర్రు (తూ॥గో॥ జిల్లా) గ్రామంలో జరిగిన వృత్తాంతం దీనికి ఋజువుగా మిగిలిపోయింది. అసలు వీరి గురి ధన సంపాదన.

ప్రియ స్నేహితులారా! మీరు ఆత్మ సంబంధంగా ఆలోచిస్తే సువార్త ప్రకటనయే దేవుడు కోరునట్టి ఆజ్ఞ. స్వస్థత ప్రకటించేవారికి బైబిలులో ఉన్న దేవుని సంకల్పమేమిటో తెలియదు. "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్ళియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" (1 యోహా॰ 4:1).

E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## ఇదియే సరియైన సమయము

"దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసి 5:15).

సర్వసాధారణంగా మనకెప్పుడు ఏ విషయంలోనూ సమయం సరిపడ ఉండదు. మన అనుదిన జీవితంలో మనం కోరుకునే వాటికి మనం చేయదల్చుకున్న వాటికి సమయం చాలదు. ఏదో ఒక పనిలో నిమగ్నమౌతున్నప్పుడు మరొక పని చేయవలసిన అవసరత ఏర్పడు

తుంది. నిత్య జీవితంలో మన యిల్లు-కుటుంబం-ఉద్యోగం వాటి అవసరతల కొరకు మన కాలాన్ని సర్దుబాటు చేసుకుంటూ ఉంటాం. మనలో అనేకులు పగలు పన్నెండు గంటలు చాలక రాత్రిలందు కూడా ఎడతెరిపిలేని పనుల్లో తలమునకలౌతుంటారు. సమయములు, కాలములు దేవునివని తెలిసికూడా, ప్రభువులేని జీవితం శూన్యమని ఎరిగి కూడా అనేకమార్లు మనం పొరపాట్లు చేస్తుంటాం. సమయ మంతా మన స్వప్రయోజనాలకై కేటాయిస్తూ మన ఆత్మల రక్షకు డైన ప్రభువు కొరకు సమయమే కేటాయించక దొర్లిపోతున్న దినా లెన్నో మనదైనందిన జీవితంలో కన్పిస్తుంటాయి.

## ప్రభువుకొరకు సమయం వెచ్చించాలి

మనం ఏ రకంగా, ఎంత సమయాన్ని ప్రభువు కొరకు వెచ్చింప గల్గుతున్నాం? మనం చదువుచున్న వ్రాఁడు-మనలను చదివి మనకు సరైన మార్గాన్ని, సత్యాన్ని చూపగల్గిన పరిశుద్ధ గ్రంథాన్ని దిన దినం క్రమం తప్పక చదువు సమయం ప్రత్యేకింప గల్గుచున్నామా? ఏదో ఆనవాయితీగా భోజనానికి ముందు కాక, మన దినచర్యలో ఒక భాగంగా మన పరలోకతండ్రితో మాట్లాడే ప్రార్థనలో ఎంత సమయాన్ని గడపగలుగుతున్నాం? దినారంభంలో దైవ ధ్యానానికి కాలం ప్రత్యేకింప గల్గుతున్నామా? తరచి చూస్తే మనలో అనేకులు (నేను కూడా సుమా!) తగినంత కాలాన్ని ప్రభువుకొరకు వెచ్చింపక, మన జీవన వ్యాపారానికే కాలమంతా వెచ్చిస్తున్నామనిపిస్తోంది. వినడానికి భయంగాలేదూ! ప్రభువు సమయాన్ని దొంగిలించి మన స్వంత పనుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాం.

పై విధమైన మన దినచర్యను సరిదిద్దుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. యాకోబు భక్తుడంటారు, "మీ జీవ మేపాటిది? మీరు కొంత

సేపు కనపడి అంతలో మాయమైపోవు ఆవిరివంటివారే! (యాకోబు 4:14). ప్రభువు నిమిత్తం మన సమయాన్ని వెచ్చించక దినమంతా మనమే సమయం దొంగిలిస్తే మన భవిష్యత్తు అంధకార బంధురమవుతుందని గ్రహించాలి. ప్రభువులో అంటకట్టబడని జీవితం వ్యర్థమై వాడువారినదై దీవెనలు పొంద అనర్హమౌతుంది.

## ప్రధానస్థానం ప్రభువుదే

మన జీవిత గమనంలో ప్రభువుకు అతి ప్రధాన స్థానం ఇవ్వవలసిన ఘడియలివి. క్షణక్షణానికి మానవ మనుగడ దిగజారిపోతోంది. వర్తమానంలో మనుష్యులు వారి ఆత్మల రక్షణార్థం అంతగా పట్టించుకొనక, ఈలోక సంబంధమైన ఆస్తిపాస్తులు సంపాదించుటకు, ఇహలోక భోగభాగ్యాలతో తులతూగుటకు పరుగులు పెడ్తున్నారు. మత్తయి 16:26లో ప్రభువంటారు, "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటే అతనికేమి ప్రయోజనము?" ఈ వాక్యము ఈనాడు కూడా మనలను హెచ్చరిస్తుంది. మన జీవితాలలో ప్రథమ స్థానం ప్రభువుకు ఆపై మన అవసరాలకు వినియోగించవలసి ఉంది. చాలాకాలం క్రిందట ఒక రచయిత కలం నుండి జాలువారిన మాటలు గుర్తు చేసుకుంటే నిజం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. "క్రీస్తును కలిగియున్న నా జీవితం అర్థయుక్తము. ఆనందదాయకం. క్రీస్తులేని జీవితం ఒంటరిదే కాక శూన్యమై అర్థవిహీనము".

మన కందరికి తెలుసు, మన ప్రభువు అతిత్వరలో తిరిగి రానైయున్నాడని, అయితే ఆయన రాకడ సమయాన్ని 'ఇప్పుడు' అని ఖచ్చితంగా వివరించి చెప్పలేం. ప్రతి క్రైస్తవుడు ఆయన రాకడ కొరకు ఎదురుచూస్తూ తన్ను తాను సిద్ధపర్చుకొని వేచి చూడాల్సిన సమయమిది. క్రైస్తవులమైన మనం దైవ చిత్తానుసారమై, యదార్థ

యుక్త జీవితం జీవిస్తూ, ప్రభువుకొరకు నమ్మకమైన దాసులుగా ఎదగవలసిన తరుణమిది. సంఘ కూడికలలో ఆరాధన నియమాలు పాటిస్తూ దైవ రాజ్యాభివృద్ధికై పాటుపడవలసిన కాలమిది. సమయం మించిపోక ముందే అనేకులను ప్రభువు సన్నిధికి నడుపవలసిన ప్రత్యేక సమయమిది.

కాలగమనంలో మన అవసరాలను క్రమబద్ధం చేసుకొని, నియమ ప్రకారం ప్రతి పనికి ప్రత్యేక సమయం కేటాయిస్తుంటాం. వంట పనులకు నియమిత సమయం ప్రత్యేకిస్తాం. చేసిన పనికి సమయాను క్రమంగా పరుమానం పొందుతాం. ఆటలాడినా సమయం పాటిస్తాం. పరుగు పందానికి సమయం నిర్ణయిస్తాం. అంతా నియమ సమయమయం. చివరికి మన జీవితయాత్ర కూడా కాలంతో ముడిపడి ఉంది. కానీ మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు కాలాతీతుడు.

## నిత్యత్వానికి సిద్ధపడాలి

మన దృష్టిలో మన జీవిత యాత్ర బహు దీర్ఘంగా కన్పించినా, ఆయన దృష్టిలో అది క్షణభంగురమే. ఈ ధరలో మన జీవితయాత్ర ముగియగనే కాలంతో మనకున్న సంబంధం తెగిపోతుంది. ఆపై నిత్యత్వంలో మన ప్రయాణం కొనసాగుతుంది. నిత్యత్వం అనంతమైనది. అంతము లేనిది. ఈ లోకంలో మన జీవన సరళిపై నిత్యత్వంలో మన మనుగడ ఆధారపడి ఉంటుంది. ఇహలోక జీవనంలో మన ప్రభువుకు లోబడక, ఆయన కివ్వవలసిన ఘనత, మహిమ ఆయన కివ్వక మనం దొంగిలించి, దైవచిత్తానుసారంగా జీవించక పోతే మన గమ్యం సాతానుకు దాని దూతలకు ఏర్పాటు చేయబడ్డ అగ్ని గుండమే సుమా! అక్కడ నిరంతరము ఏడ్పు, పండ్లు కొరుకుటయే (మత్తయి 13:50). ఇహమందు మనం దేవుని కొరకు సమయాన్ని కేటాయించి, ఆయన

ఆజ్ఞలకు బద్ధులమై జీవిస్తే పరమందు సదా ఆయనతో ఉండే ఆశీర్వాదం పొందగలం.

ఇహలోక ఆర్జనలో సమయాన్నంతా వినియోగిస్తున్న వారిని హెచ్చరిస్తూ ప్రభువు సెలవిచ్చినది గమనిస్తే, "భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు. ఇక్కడ చిమ్మెటయును తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి. అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీ ధనమెక్కడ నుండునో, అక్కడ నీ హృదయముండును" (మత్తయి 6:19-31).

దైవ చిత్తానుసారంగా కాక, మన స్వంత శక్తి సామర్థ్యాలలో ఏదో సాధిద్దామని ఎంత ప్రయత్నించినా చివరకు మిగిలేది ఆయాసమే తప్ప ప్రయోజనం శూన్యం.

ప్రసంగి 12 : 13 లో మానవకోటి విధిని సూచిస్తూ, "దేవుని యందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి" అని వ్రాయబడింది.

మన హృదయాలను ప్రభువుపై లగ్నపరచి, మన హృదయ సింహాసనమందు ఆయనకు ఆధిపత్యమొసంగి మన సమయాన్ని ప్రభువు కొరకు సరిపడ వెచ్చిస్తూ జీవిస్తే మనం నిత్యత్వంలో ధనం సంపాదించినవారం కాగలము. ప్రియ చదువరీ! ప్రభువు నీ కొరకు సమయాన్ని వెచ్చించి కాచుకొని యున్నాడని గ్రహించగల్గావా ? మరి ప్రభువు కొరకు నీ సమయాన్ని ప్రత్యేక పర్చావా?

—రజువాలు ఛఖసాంగ్, నాగాలాండ్.

———

# యూదారాజైన ఆసా

## (Asa the King of Judah)

ఆసా దేవుని దృష్టికి అనుకూలముగ నడిచిన మూడవ యూదా రాజు. విగ్రహారాధికు రాలైన తన అవ్వ పట్టపు దేవి కాకుండ చేసి తాను రాజ్యమునకు వచ్చెను. అతడు తన తండ్రి ప్రతిష్ఠించిన దేవతా విగ్రహములను నాశనము చేసెను. పురుషగాములను దేశములో నుండి వెళలగొట్టెను. వారి పితరుల దేవుడైన యెహోవాను ఆశ్రయించుటకును, ధర్మ శాస్త్రమును బట్టియు, విధిని బట్టియు క్రియలు జరిగించుటకును యూదా వారికి ఆజ్ఞాపించెను. విశ్వాస జీవితము జీవించిన ఆసా జీవితము ఆశ్చర్యకరమైన ముగింపును కలిగి యుండెను.

ఆసా తన యేలుబడియందు ముప్పది తొమ్మిదవ సంవత్సరమున పాదములలో జబ్బు పుట్టి బహు బాధపడినను దాని విషయములో అతడు యెహోవా యొద్ద విచారణ చేయక వైద్యుల నాశ్రయించెను. కనుక ఆసా తన యేలుబడి యందు నలుబది యొకటవ సంవత్సరమున మృతి నొందెను (2 దినవృత్తాంతములు 16 : 12-13). ఈ రెండు వాక్యములు మనకు గొప్ప విషయములను తెలియ జేయుచున్నవి.

మొదటిది: తన ప్రార్థనలకు ప్రత్యుత్తరములను పొందిన వ్యక్తి ఆసా. ఒకసారి కూషీయులు దండెత్తిరాగా ఆసా యెహోవాను ప్రార్థించెను (2 దిన 14:11). దాని ఫలితము. యెహోవా ఆకూషీయులకు ఆసా యెదుటను, యూదావారి యెదుటను నిలువనియ్యక వారిని మొత్తినందున వారు పారిపోయిరి (2 దిన 14:12). ఆసా ప్రార్థనను దేవుడు ఆలకించాడు. నీ ప్రార్థనలను దేవుడు ఆలకించె వ్యక్తిగా నీవుంటివా? ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను, ఆయన చెవులు

వారి ప్రార్థనల వైపునను ఉన్నవి (1 పేతురు 3:12). మన అత్యవసర పరిస్థితులలో దేవుడు మనకు సహాయము చేయునట్లు దేవునికిని మన కును గల సంబంధము సువిశాలమైనదిగా యుంచుకొనవలెను.

రెండవదిగ : ఆసా మరణావస్థలో యుండినపుడు దేవుని సహాయము కోరలేదు. ఆసా దేవుని యందు భక్తి విశ్వాసములుగల మంచి రాజైనను, అతడు భయంకరమైన వ్యాధితో కొంత కాలము బాధ పడెను. అయినను అతడు దేవుని సహాయము అడుగక వైద్యుల నాశ్రయించిన ఫలితముగ అతడు మరణించెను.

యాకోబు ఈ విధముగా వ్రాయుచున్నాడు: దేవుని అడుగ నందున మీకేమియు దొరకదు (యాకోబు 4:2). ఈ విషయములో రాజైన ఆసా మనకు ఒక సూచనగ యున్నాడు. ఆసా యొక్క అవస రత యేమిటో దేవునికి తెలియును. మీరు మీ తండ్రిని అడుగక మునుపే మీకు అక్కరగ నున్న వేవో ఆయనకు తెలియును (మత్తయి 6 : 8). ఆయన దీవెనలను మనము పొందుటకు ఆయనను మనము అడుగవలెను. "అడుగుడి మీ కియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును" (మత్తయి 7:7).

మనము ఊహించిన దానికంటె అత్యధికముగ మనలను దీవించుటకు శక్తి దేవునికి గలదు. మనము అడుగు వాటన్నింటికంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగ చేయ శక్తిగల దేవునికి (ఎఫెసీ 3:20) అని పౌలు వ్రాయుచున్నాడు. రాజైన ఆసా "స్వస్థత" అనే దేవుని దీవెనను దేవుని అడుగనందున పొందలేకపోయెను. ఆ విషయములో తనకు తానే ద్రోహము చేసికొనెను. మనము దేవుని అడుగనందున దేవుడు తన యిష్టపూర్వకముగ మనకు ఈయదలచిన దీవెనలను ఎన్ని పోగొట్టుకొనుచున్నాము? ఎన్ని దీవెనల కొరకు మనము దేవునికి ఎడతెగక ప్రార్థన చేయుచున్నాము? ★

—వెల్డన్ లాంగ్‌ఫీల్డ్.

# క్షమించలేని దాసుని గూర్చిన ఉపమానము
## ( The Parable of Unforgiving Servant )

మత్తయి 18:23-35 లో క్షమించలేని దాసుని గూర్చిన ఉపమానమును యేసుప్రభువు చెప్పెను. ఈ ఉపమానములో ఒక దాసుడు తన యజమానికి ఎంతో డబ్బు అచ్చియుండినట్లు చూడగలము. ఈ దాసుడు తన అప్పు తీర్చలేక పోవుచున్నందున అతని యజమానుడు తనకు కలిగిన వన్నియు అమ్మి తన అప్పు తీర్చుమని చెప్పెను. అయితే ఆ దాసుడు తన యజమానుని బ్రతిమలాడి అచ్చియున్నది తీర్చలేను, క్షమించుమని వేడుకొనినపుడు యజమానుడు దయతో వానిని క్షమించెను.

అయితే ఆ దాసుడు తనకు అంతకంటె తక్కువ సొమ్ము అచ్చియున్న తనతోడి దాసునియొద్దకు వెళ్ళి, తనకు అచ్చియున్న దాని చెల్లింపుమని అడిగెను. తన తోటి దాసుడు తనకు అచ్చియున్న దంతయు పూర్తిగ చెల్లించెదను కొంత కాలము కనిపెట్టుమని అడిగెను. దానికి ఆ దాసుడు ఒప్పుకొనక తనకు అచ్చియున్నది చెల్లించువరకు వానిని చెరసాలలో వేయించెను.

జరిగినదంతయు మిగిలిన దాసులు చూచి, వారు విచారించి, విషయమంతయు తమ యజమానికి తెలియజేసిరి. యజమానుడు తనకు అచ్చియున్న దాసుని పిలిపించి, "నేను నిన్ను క్షమించితినిగదా, నీవెందుకు నీ తోడి దాసుని క్షమించలేదు!" అని చెప్పి తనకు అచ్చియున్నది చెల్లించువరకు బాధించువారికి తనను అప్పగించెను. ప్రతివాడు తన సహోదరుని హృదయపూర్వకముగ క్షమింపని యెడల మన పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే చేయునని చెప్పి యేసు ఈ ఉపమానమును ముగించెను.

మత్తయి 18:15-17 లో మన క్షమాపణ యెట్టిదిగా యుండ వలెనో మనకు విశదముగ కనబడుచున్నది. (1) మన సహోదరుని యొద్దకు మనము ఒంటరిగ యుండినపుడు వెళ్ళవలెను (15వ) (2) అతడు వినని యెడల ఇద్దరు, ముగ్గురు సాక్షుల నోట ప్రతిమాట స్థిరపరచబడు నట్లు ఒకరిద్దరిని వెంటబెట్టుకొని అతని యొద్దకు పొమ్ము (16 వ) (3) అతడు వారి మాటలు వినని యెడల ఆ సంగతి సంఘమునకు తెలియజెప్పుము (17 వ).

ఆత్మతోను, సత్యముతోను దేవునిని ఆరాధించాలి అనే విషయమును గ్రహించుట సులువే. అయితే మనము మన సహోదరులతో సమాధానము కలిగియుండని యెడల ఆ ఆరాధన సరియైనది కాదని ప్రభువు మనకు మత్తయి 5:23-24 లో బోధించుచున్నాడు.

కొందరు "నేను క్షమిస్తాను, క్షమించగలను. కాని ఆ విషయాన్ని మరచిపోలేను" అని చెప్పుదురు. అయితే నిజమైన క్షమాపణ ఆ విషయమును ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనకుండుటయే (హెబ్రీ 10 : 17).

. ఈ సందర్భంగా ఒక చిన్న కథ: ఒక చక్కని చిన్న అమ్మాయి అందమైన క్రొత్త దుస్తులు ధరించి, చేతుల నిండుగా పూలు పట్టుకొని దారివెక్కగ నడిచిపోవు చుండెను. వెళ్ళుచూ ఆమె అచ్చట మురికిలో ఆడుచున్న ఒక బాలుని చూచి నవ్వింది. ఆ బాలుడు తన చేతిలోని మురికితీసి ఆ అమ్మాయియొక్క దుస్తులపైన విసరగా ఆ అమ్మాయి తన అందమైన దుస్తులు పాడైనందుకు ఏడ్చుచూ తన చేతిలోని పూలను క్రింద పారవేసి ఆ బాలుని చెంతకు వెళ్ళుచూ దానిలోని ఒక పువ్వు తీసికొని తన దుస్తులపైనున్న మురికిని తుడుచుకొనెను.

ఆ బాలుని దగ్గరకు వచ్చినపుడు ఆమె ఆ చేతిలోని పువ్వును ఆ బాలునికిచ్చి నేను నిన్ను ప్రేమించుచున్నానని చెప్పెను.

నీవు ఈ చిన్న బాలికవలె క్షమించగలవా? మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల, మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు (మత్తయి 6:14-15) అని యేసుప్రభువు మనకు చెప్పెను.

—A.M. ఉబర్.

---

బైబిలు పాఠం:

## విలువపెట్టి కొనబడినవారు

( గత సంచిక తరువాయి )

### II మీరు మీ సొత్తుకారు :

(A) మనము దేవునికి చెందినవారము (1 కొరి 6:19-20)

1. మనము దేవుని జతపనివారమై యున్నాము; దేవుని వ్యవసాయమును దేవుని గృహమునై యున్నాము (1 కొరి 3:9). దీనిని ఆలోచించండి! దేవునితో జతపనివారమై యున్నాము !!

2. మందిరం, ఆలయం అనే భావం క్రొత్త నిబంధనలో కనబడుచున్నది. క్రైస్తవులు "సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:5).
"దేవుడు నా కనుగ్రహించిన కృప చొప్పున నేను నేర్పరియైన శిల్పకారునివలె పునాది వేసితిని, మరియొకడు దానిమీద కట్టుచున్నాడు; ప్రతివాడు దానిమీద ఏలాగు కట్టుచున్నాడో చూచుకొనవలెను" (1 కొరింథీ 3:10).

(B) మన ప్రభువు సంఘము ఆయన రక్తముచే కొనబడినది
(అపొ. కా. 20 : 28).

1. "ఆ పెద్దలు-నీవు ఈ గ్రంథమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు. నీవు వధింపబడినవాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడు వారిలోను ప్రతి ప్రజలోను ప్రతి జనములోను దేవుని కొరకు మనుష్యులను కొంటివి" (ప్రకటన 5:9-10).
2. మనము దేవునికి చెందినవారము గనుక మనుష్యులకు దాసులము కాము. అయినను మనుష్యులకు పరిచర్య చేతుము (1 కొరి 7:23).

ముగింపు:

సమస్త విధమైన సంశయాలను విసర్జించి తాను క్రీస్తు కొరకు ఏర్పరచుకొనబడిన వాడినని ఎరిగినవాడు క్రైస్తవుడు. నీతిని జరిగించుట కతడు అత్యాసక్తిగలవాడు. దేవుని చిత్తాన్ని ఎరిగి దానికి లోబడుటకు ఆసక్తిగలవాడతడు. పాపముచేయుటకు మనము శోధించబడినప్పుడు క్రీస్తు సిలువను గుర్తుతెచ్చుకొందము: "ముండ్లన్ దుర్మార్గులల్లిన కిరీట మేసుకుండినన్, ఈ భూకిరీటములన్నీ దానం దూగంగ జాలునే". క్రీస్తు మన కొరకు తన ప్రాణమర్పించెను. ఆయన మరణం నీ యెడల వృధా కాకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనుము. ★

—విలియమ్ క్లైన్.

---

## విముక్తి

ఎఫెసీ 1:22, కొలస్స 1:18, అపొ. 4:12

(1) లేదు లేదు శక్తి - ఈ లోక జ్ఞానములో విముక్తి
విగ్రహారాధనలో ఉన్నది నాస్తి-దాన్ని నమ్మితే భయంకర దుస్థితి
మాయవంటి విగ్రహమును మనసారా పూజిస్తే
మారని నీ బ్రతుకులో పొందేది అధోగతి. యెషయా 44 : 9.

(2) మతశాఖలలో ఉన్నది-మాయవంటి సాతాను శక్తి
పరిశుద్ధాత్మ పడిందంటూ ప్రజలను భ్రమపరచే రక్తి
వారి కడుపులకే ఈ భక్తి-వారి బోధలే సాతాను దోస్తి
వారి గుంపే భయంకర రొంపు-వారిని నమ్మితే, నరకానికి జంపు.

1 యోహాను 4 : 1.

(3) వరుడులేని సంఘమది-రెవరెండ్‌ల రాజ్యమది
గురిలేని గుంపు అది-గురువులకు భోజ్యమిది
అపొస్తులులమని చెప్పుకుంటూ-అందరిని మోసగిస్తూ
గురుగులనే విత్తుకుంటూ-గుంపులను చేర్చుకుంటూ.

మత్త 13 : 24.

(4) క్రీస్తు రాజ్యము కొరకు-రక్తాన్ని చిందిస్తే
క్రీస్తు పేరును విడచి-తండ్రి చిత్తము మరచి
క్రీస్తు వాక్యము విడచి-క్రీస్తు మార్గము మరచి
క్రీస్తు సంఘమంటే-ఎందుకో ఎనలేని మంట.

కొలస్స 1:14, అపొ. 20:28.

(5) తెలుసుకో సోదరా-తిరుగులేని సత్యాన్ని
సత్యవాక్యము తెలుసుకో-సత్యసంఘమందు నడువు
క్రీస్తు శరీరము సంఘము-సంఘమునకు శిరస్సు క్రీస్తు
క్రీస్తు సంఘమందే విముక్తి-ఇది బైబిలులో దైవసూక్తి.

—నేలపూడి కృష్ణమూర్తి, గంటి.

# సంక్షిప్త వార్తలు

దేవుని యెదుట యోగ్యమైన పనివారిగ సత్యవాక్యమును సరిగ విభజించువారిగ సోదరులను తీర్చి దిద్దుచున్న క్రీస్తు సంఘ సువార్తికుల సమావేశములు మరియు సువార్త కూటములు అనేకులను క్రీస్తునొద్దకు నడిపించుటలో కూడ ప్రయోజనకరముగ నున్నవి. బైబిలు నందలి అర్ధముకాని భాగములు (Difficult Texts) సులువుగ వివరించబడుట చేత అనేక మంది బోధకులు పదును పెట్టబడుచున్నారు. సువార్త దండయాత్రల ద్వారా ఇంటింటికీ, సువార్త అందుచున్నది. కరపత్రాలు పంచిపెట్టబడు చున్నవి. ఐక్యతలో ఉన్న ఫలితాన్ని సోదరులు చూడగలుగుచున్నారు. ఈ పని ఒకేచోట కాక ఆయా గ్రామాలలో జరుగుట వలన స్థానిక సంఘములు క్షేమాభివృద్ధి నొందుచున్నవి.

మే నెల సువార్తికుల సమావేశము 20వ తేదీ బుధవారం దేవ గుప్తంలో ఆనంద దాయకంగా జరిగెను. 'నేడు ఎవరైనను సూచక క్రియలు (అద్భుతములు) జరిగించ గలరా?' అను అంశమును సోదరులు చర్చించిరి.

ఉదయ కాలమున జరిగిన సమావేశమునకు సోదరులు వడ్డి చిన్నయగారు అధ్యక్షత వహించగా సోదరులు S. రామకృష్ణారావు గారు (గంటి) చర్చను ప్రారంభించిరి. యేసుప్రభువు ఒక ప్రయోజనము నిమిత్తమై సూచక క్రియలు జరిగించెనని "యేసు దేవుని కుమారుడైన క్రీస్తు" అని జనులు నమ్మునట్లును "నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లు" యివి జరిగించబడెనని చెప్పిరి (యోహా 20:30-31). సోదరులు పాల్ గూటంగారు (గొల్లవిల్లి) మాట్లాడుచు, యేసు చేసిన అద్భుతములు ఆయన దేవుని కుమారుడని ఋజువుచేయు

నిమిత్తమై జరిగించబడెనని అపొస్తలులు చేసిన అద్భుతములు వాక్యము స్థిరపరచబడు నిమిత్తము జరిగించబడెనని (మార్కు 16:20) సూచక క్రియలయొక్క ప్రయోజనమునుగూర్చి లేఖనములు బోధించు సంగతులు చదివి గ్రహించి ఇతరులకు వాటి ప్రయోజనమును ప్రకటించు బాధ్యత మనపై యున్నదని చెప్పిరి. క్రీస్తు ప్రభువు తన శిష్యులకు సూచకక్రియలు జరిగించు అధికారమునిచ్చెను. మత్త 10:1. వారు వెళ్ళి పరలోక రాజ్యమును గూర్చి ప్రకటించుచున్న సమయంలో వారిని ఈ విధముగ హెచ్చరించెను: "అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనపరచెదరు" మత్త 24:24.

"నీ నామమున అద్భుతములు చేయలేదా?" అని క్రీస్తు ప్రభుని ప్రశ్నించు అనేకులకు ఆయన సమాధానం: "నేను మిమ్మును ఎన్నడును ఎరుగను అక్రమము చేయువారలారా నాయొద్దనుండి పొండని" ఆయన చెప్పే దినము రాబోవుచున్నదని చెప్పిరి. అపొస్తలులు చేతులుంచగా పరిశుద్ధాత్మ శక్తిని పొందినవారు తిరిగి ఆశక్తిని యితరులకు యివ్వలేక పోయిరి. అందుచేతనే పౌలు తిమోతిని "త్వరపడి యెవని మీదనైనను హస్త నిక్షేపణము చేయకుము" (1 తిమోతి 5:22) అని హెచ్చరించెనని వాక్యము స్థిరపరచబడిన తరువాత సూచక క్రియలు జరుగలేదని మంచి వివరము నందించిరి. సోదరులు N. సత్యంగారు (బొబ్బర్లంక) Ch. జాన్‌బాబుగారు (ముంగండ) V. చిన్నయ్యగారు (కశలి) చర్చలో పాల్గొని నేడు అద్భుతములు జరిగించుచున్నామని చెప్పుకొను వారు "ఉపదేశింప కూడని వాటిని దుర్లాభము కొరకు ఉపదేశించు చున్నారని" (తీతు 1:11) తెలియజేసిరి.

మధ్యాహ్న సమయమునకు సోదరులు ఇ.కె.వి. ప్రసాదరావు

గారు అధ్యక్షత వహించగా సోదరులు బూల యోహానుగారు (పల్లంకుర్రు) సోదరులు నెహెమ్యా కూటంగారు (కాకినాడ) ఈ అంశముపై చక్కని వివరణ యిచ్చి గొప్ప పాఠములను అందించి సువార్తికులకు మంచి తర్ఫీదు నిచ్చిరి. సోదరులు మాట్లాడుచూ 'అద్భుతము అంటే ఏమిటి? ప్రకృతి ధర్మమునకు విరుద్ధముగ జరుగునట్టిది (Working in Un-Natural, Setting aside The Natural). క్రీస్తు ప్రభువు చేసిన మొదటి అద్భుత మేమంటే ఆయన నీళ్ళను ద్రాక్షారసముగ మార్చెను. అద్భుతములు జరిగించుట కొరకు క్రీస్తు ప్రభువునకు కొలతలేని ఆత్మ అనుగ్రహింపబడెను. అపొస్తలులు కొలతగల ఆత్మ పొందిరి. అపొస్తలులు చేతులుంచగా పరిశుద్ధాత్మ శక్తిని పొందినవారు కూడ అద్భుతములు జరిగించిరి. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారికివ్వబడుచున్నది. వారిలో నివసించు ఆత్మ (II తిమోతి 1:14). నేడు సూచక క్రియలయొక్క అవసరము మానవులకు లేదు. స్థిరపరచబడిన వాక్యము మనకు సూచక క్రియలద్వారా లభ్యమైనది. ఇది సంపూర్ణ నియమము. 1కొరింధీ 13:8-13. ఈ అంశమును చక్కగా వివరించుచున్నదని చెప్పిరి. "ప్రవచనములైనను నిరర్థకములగును. భాషలైనను నిలిచిపోవును జ్ఞానమైనను నిరర్థకమగును"......"కాగా విశ్వాసము నిరీక్షణ ప్రేమ ఈ మూడును నిలుచును". అద్భుతములు వాటి ప్రయోజనము నిమిత్తమై జరిగి నిలిచిపోయెను అని వివరించిరి. వాక్యము స్థిరపరచబడెను. స్థిరపరచబడిన వాక్యము యేసు దేవుని కుమారుడని ఋజువు చేయుచుండగా అద్భుతముల పని ఏమిటి? నేడు అద్భుతములు జరిగించుచున్నామని చెప్పుకొనువారు(Fake Healers) ఘోరంగా విఫలమైన అనేక సందర్భాలు సోదరులు గుర్తుచేసిరి. యిట్టి అబద్ధ సిద్ధాంతమునకు ప్రజలు ఆకర్షితులు కాకుండునట్లు వారికి సత్యమును ప్రకటింప వలసిన బాధ్యతను నొక్కిచెప్పిరి.

సాయంకాలం 5 గం॥ నుండి దేవగుప్తం గ్రామంలో గొప్ప సువార్త దండయాత్ర జరిగెను. అనేక కరపత్రములు పంచిపెట్టబడెను. రాత్రి కూటములో సోదరులు నెహెమ్యా గూటంగారు "వారి ఫలముల వలన మీరు వారిని తెలిసికొందురు" (మత్త 7:15) అను అంశమును బోధించిరి. దేవగుప్తం స్థానిక క్రీస్తు సంఘము మరియు సువార్తికులు N. ఏలియాగారు చక్కని ఏర్పాట్లు చేసి, మంచి ఆతిధ్యమిచ్చి కార్యక్రమము సమర్థవంతమైన రీతిలో నిర్వహించుటలో సఫలులైరి. కూటము అనంతరము సోదరులు సంతోష హృదయాలతో తమ గ్రామములకు తిరిగి వెళ్ళిరి.

* * *

జూన్ నెల సువార్తికుల సమావేశము పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట గ్రామంలో 24వ తేదీ బుధవారం జరిగించుటకు సహోదరులు నిశ్చయించిరి. ఈ పత్రిక ముద్రించు సరికి సహోదరులు పి. సామ్యూల్ గారు, వారి కుమారుడు సామ్యూల్ రాజుగారు తదితర సహోదరులు ఆచంట సమావేశమునకు నిర్విరామ కృషి చేయుచున్నట్లు వార్తలందినవి.

* * *

ఏప్రియల్ చివరివారంలో అమెరికా పర్యటన నిమిత్తమై వెళ్ళిన సోదరులు జాషువా గూటంగారు, వారి సతీమణి కబిత గూటంగారు తమ పర్యటన ముగించుకొని జూన్ 6వ తేదీనాడు కాకినాడకు క్షేమంగా చేరుకొన్నారు. కాకినాడ స్టేషన్‌లో వారి కుటుంబ సభ్యులు, సంఘస్థులు పూలమాలలతో వారికి ఘన స్వాగత మిచ్చిరి.

—o—

## సత్యవాణి రేడియో కార్యక్రమాలలో మార్పు

1992 జూన్ 7వ తేదీ నుండి సత్యవాణి రేడియో

కార్యక్రమాలను రేడియో శ్రీలంక ద్వారా

ఈ దిగువ సమయాల్లో వినండి!!

ప్రతి శని, ఆది, మంగళ వారాల్లో

మధ్యాహ్నం 2-00 నుండి 2-15 వరకు

మ రి యు

ప్రతి గురు, శుక్ర వారాల్లో

మధ్యాహ్నం 2-15 నుండి 2-30 వరకు


*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001


No.

To

..............................................

..............................................

..............................................

..............................................